క్లుప్తంగా

నేటి నుంచి పర్యావరణ పర్యాటకంపై జాతీయ సదస్సు

పీలేరు రూరల్ : స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పర్యావరణ పర్యాటకం సుస్థిరాభివృద్ధి అంశంపై గురువారం నుంచి రెండు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. సుధాకర్ రెడ్డి తెలిపారు. ఏపీ పర్యాటక అభివృద్ధి సంస్థ ప్రాంతీయ సంచాలకుడు డాక్టర్ ఆర్. రమణప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు.

వర్మీ కంపోస్టు తయారీపై ముగిసిన శిక్షణ



శిక్షణ పూర్తి చేసుకున్న గ్రామీణ యువతతో కేవీకే శాస్త్రవేత్తలు

కలికిరి : కేవీకే కార్యాలయంలో వర్మీ కంపోస్టు తయారీపై వారం రోజులుగా జరిగిన వృత్తి నైపుణ్య శిక్షణ ముగిసినట్లు కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ మంజుల తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న 15మంది గ్రామీణ యువతకు పరీక్ష నిర్వహించి, గుర్తింపు పత్రాలను అందజేశామన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి గిరినాథ్, కేవీకే శాస్త్రవేత్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

పెద్దతిప్పసముద్రం : అసంపూర్తిగా ఉన్న పక్కా గృహాల నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీఓ అబ్దుల్ కలాం ఆజాద్ సూచించారు. బుధవారం ఆయన మండలంలోని ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్ సిబ్బందితో సమీక్షించారు. అధికారులు అలసత్వాన్ని విడనాడి లబ్ధిదారులతో మాట్లాడి నిర్మాణాలు పూర్తి అయ్యేలా చొరవ చూపాలన్నారు.

జేఎన్‌టీయూ వాలీబాల్ జట్టుకు ఎంపిక



వాలీబాల్ టీమ్‌కు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

కురబలకోట : అనంతపురం జేఎన్‌టీయూ వాలీబాల్ టీమ్‌కు అంగళ్లులోని మిట్స్ ఇంజినీరింగ్ కళాశాల బీటెక్ విద్యార్థులు బి. ఆమోస్, నాజిద్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ యువరాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ టీమ్‌కు వీరు ప్రాధాన్యత వహిస్తారని తెలిపారు. ఈనెల 18 నుంచి 22 వరకు తిరువనంతపురంలోని కేరళ విశ్వ విద్యాలయంలో జరిగే పోటీలలో పాల్గొంటారని తెలిపారు.

ఆర్‌టీఐ పోస్టు తిరస్కరణ

బి.కొత్తకోట : సమాచార హక్కు చట్టం కింద వివరాల కోసం స్థానిక వెలుగు కార్యాలయానికి ఓ వ్యక్తి పంపిన రిజిస్టర్ పోస్టును అధికారులు తిరస్కరించి వెనక్కు పంపారు. పౌర సమాచార అధికారి పేరిట చేసుకున్న దరఖాస్తును రిజిస్టర్ పోస్టు ద్వారా పంపగా అది ఈనెల 6, 7న రెండుసార్లు తపాలాశాఖ సిబ్బంది తీసుకెళ్లి ఇచ్చారు. పోస్టుపై పౌర సమాచార అధికారి పేరుతో చిరునామాకు పంపడంతో దాన్ని తీసుకునేందుకు ఉద్యోగులు ఎవరూ ఆసక్తి చూపలేదు. దీనితో పోస్టును స్వీకరించకుండా తిరస్కరించారని పేర్కొంటూ తపాలాశాఖ దరఖాస్తు పంపిన వ్యక్తికే తిరిగి పంపింది. దీనితో వెలుగు మండల సమాఖ్య కార్యాలయం సమాచార హక్కు దరఖాస్తులపై ఎంతటి నిర్లక్ష్యం వహిస్తోందో ఈ ఘటన నిదర్శనంగా నిలుస్తోంది.

మోహన్‌బాబును అరెస్ట్ చేయాలి

మదనపల్లె : జర్నలిస్టులపై దాడికి తెగబడ్డ సినీ నటుడు మోహన్‌బాబును వెంటనే అరెస్ట్‌చేయాలని ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ బండపల్లె అక్కులప్ప, జిల్లా కార్యదర్శి వంశీధర్‌లు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ...మోహన్‌బాబు కుటుంబ వ్యవహారాల్లో మీడియా జోక్యం చేసుకోలేదని, వారి కుటుంబ వ్యవహారం పోలీస్‌స్టేషన్‌కు వెళ్లిన తర్వాతనే మీడియా జోక్యం చేసుకుందన్నారు. విద్యాసంస్థల అధినేతగా, మాజీ రాజ్యసభ సభ్యుడిగా సమాజానికి మార్గదర్శకంగా ఉండాల్సింది పోయి మోహన్‌బాబు వీధిరౌడీలా వ్యవహరించాడని వారు పేర్కొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి



సమీక్షా సమావేశంలో ఎంపీడీఓ సుధాకర్

కేవీపల్లె : మండలంలో హౌసింగ్‌లో మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీఓ సుధాకర్ అన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో హౌసింగ్, ఉపాధి, గ్రామ సచివాలయ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హౌసింగ్ లబ్ధిదారులకు అవగాహన కల్పించి సకాలంలో నిర్మాణాలు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. పనులు చేసిన వెంటనే బిల్లులు చెల్లిస్తున్నట్లు తెలిపారు.

రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్‌అహ్మద్
- 13న రాయచోటిలో అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ
- దగా చేస్తున్న కూటమి సర్కార్‌పై నిరసన గళం
- ఆందోళనకు తరలిరావాలని పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్, వైఎస్సార్ సీపీ నాయకులు

మదనపల్లె : ఎన్నికల హామీలను నెరవేర్చడంలో, రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త నిసార్ అహ్మద్ విమర్శించారు. బుధవారం స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఈనెల 13న జిల్లా కేంద్రం రాయచోటిలో నిర్వహిస్తున్న అన్నదాతకు అండగా వైఎస్సార్ సీపీ కార్యక్రమ పోస్టర్‌లను నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ... కూటమి ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందన్నారు. పండించిన పంటలకు మద్దతు ధర లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన రైతుభరోసా కేంద్రాలను కూటమి సర్కారు నిర్వీర్యం చేసిందన్నారు. వ్యవసాయానికి సంబంధించి అన్ని రకాల సేవలు గతంలో ఆర్‌బీకే కేంద్రాల్లో అందేవని, నేడు పట్టించుకునే నాథుడే కరువయ్యాడన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఏటా రూ.13,500 చొప్పున రైతులకు పెట్టుబడి సాయం ఠంచనుగా అందేదన్నారు. ఎన్నికల సమయంలో అంతకుమించి ఏటా రూ.20వేలు జమచేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు బడ్జెట్‌లో నిధులు కేటాయించకుండా రైతులను మోసగించారన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఆరునెలల్లో రెండుసార్లు విద్యుత్ చార్జీలు పెంచి ప్రజలపై భారం వేశారన్నారు. కూటమి సర్కార్‌పై నిరసన గళం వినిపించేందుకు ప్రజలంతా సిద్ధమవ్వాలన్నారు. అధికారంలో ఉన్నా లేకున్నా వైఎస్సార్ సీపీ ఎప్పటికీ రైతుల పక్షపాతి అన్నారు. రైతులకు అండగా వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో రాయచోటిలో నిర్వహిస్తున్న ఆందోళన కార్యక్రమాలకు పెద్దసంఖ్యలో రైతులు, ప్రజలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు హాజరై విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఈశ్వర్‌నాయక్, కొత్తపల్లె మహేష్, నూర్‌మొహిద్దీన్‌ఖాన్, హబీబ్, చరణ్, నూరుల్లా, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అన్నదాతల సమస్యలు పట్టించుకోరా..?

పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం) : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం రైతులను దగా చేసిందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రమైన రాయచోటిలో వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టనున్న నిరసన కార్యక్రమం పోస్టర్లను వాల్మీకిపురంలో ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సూపర్‌సిక్స్ హామీలలో భాగంగా రైతులకు ఏటా రూ.20వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కూటమి రైతుల ఓట్లు వేయించుకుని అధికారంలోకి వచ్చి, ప్రస్తుతం హామీ ఊసెత్తకుండా రైతులను నట్టేట ముంచారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు ఇచ్చిన రైతు భరోసాకు కూటమి ప్రభుత్వం ఎసరు పెట్టిందన్నారు. ఖరీఫ్ ముగిసి రబీ ప్రారంభమైనా ఇప్పటి వరకు పెట్టుబడి సాయంగానీ, అన్నదాత సుఖీభవ గానీ అందక రైతులు గగ్గోలు పెడుతున్నారన్నారు. గత ప్రభుత్వంలో ప్రతి రైతుకు ఏడాదికి రూ.12,500 అని చెప్పి మరో వెయ్యి పెంచి రూ.13,500 ఇచ్చిన ఘనత అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డికి దక్కిందని గుర్తుచేశారు. ఇంతకంటే మిన్నగా రైతులకు ఇస్తామన్న కూటమి ప్రభుత్వం రైతులను పూర్తిగా విస్మరించి వారికి నమ్మక ద్రోహం చేసిందన్నారు. గత ఎన్నికలకు ముందు రైతులకు ఇచ్చిన హామీ మేరకు ప్రతి రైతుకు ఏడాదికి రూ.20వేలు ఇచ్చే వరకు రైతులు నిలదీయాలని పిలుపునిచ్చారు.

నిరసనకు పెద్ద ఎత్తున తరలి రావాలి

రైతు సమస్యలపై రాయచోటిలో శుక్రవారం చేపట్టే నిరసన కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలి రావాలని మాజీ ఎమ్మెల్యే చింతల పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అందరూ శుక్రవారం ఉదయం 9.30 గంటలకు రాయచోటి బస్టాండ్ సమీపంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయానికి చేరుకోవాలని కోరారు.

కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతల శివానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నీళ్ల భాస్కర్, వాల్మీకిపురం వైస్ సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి, నాయకులు అబ్దుల్ కలీం, కువైట్ ఇబ్రహీం, శ్రీధర్ రాయల్, రవి, రామకృష్ణారెడ్డి, మదన్ మోహన్ రెడ్డి, చికెన్ మస్తాన్, సైఫుల్లా, టైలర్ బాషా, సాదిక్, ఇలియాజ్, శ్రీనివాసులు, రమణ తదితరులు పాల్గొన్నారు.

ఒకరి భూములు మరొకరికి ఆన్‌లైన్

బి.కొత్తకోట : తమ పట్టా భూములను వేరేవాళ్ల పేరిట ఆన్‌లైన్ చేశారని బాధితులు రెవెన్యూ అధికారుల ఎదుట తమగోడు వెళ్లబోసుకున్నారు. బుధవారం మండలంలోని బడికాయలపల్లెలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. హాజరైన ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ మొహమ్మద్ అన్సారీలు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. బడికాయలపల్లెకు చెందిన జి.రవీంద్రనాయుడు, కే.ఉమాదేవమ్మలు తమ పట్టా భూములను వేరొకరి పేర్లతో ఆన్‌లైన్ చేశారని ఫిర్యాదు చేశారు. దీనిపై హైకోర్టును ఆశ్రయించినట్టు రవీంద్రనాయుడు చెప్పారు. దీనిపై చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పారు. బడికాయలపల్లెలో శ్మశానానికి వెళ్లేందుకు దారి లేదని దళితులు ఫిర్యాదు చేయగా అధికారులు వెళ్లి పరిశీలించారు. కాలిబాటను రహదారిగా చేయాలని కోరగా పట్టా భూముల్లో దారి ఏర్పాటు చేయాల్సి ఉన్నందును రైతులతో మాట్లాడగా అందరూ కలిసి నిర్ణయం తీసుకుంటామని రైతులు చెప్పారు. ఈ సదస్సుకు 70 ఫిర్యాదులు అందగా అందులో పట్టాదారు పాసుపుస్తకాలు, ఆన్‌లైన్ నమోదు, చేర్పులు, మార్పులపై వినతులు వచ్చాయి. మండల పరిషత్ ఏఓ ఆనంద్‌కుమార్, సర్వేయర్ ముబారక్, వీఆర్‌ఓలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

చలో కడప జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేసిన ముస్లిం మైనారిటీ నాయకులు

పీలేరు : ఈ నెల 15న జమియత్ ఒలమా ఏ హింద్ ఆధ్వర్యంలో జరిగే భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని సర్పంచ్ హబీబ్‌బాషా కోరారు. బుధవారం పీలేరులో చలో కడప పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ ఐక్యత కోసం, దేశ ప్రజల సమానత్వం కోసం చేపట్టే ఈ కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలి రావాలని కోరారు. ముతవల్లీలు అల్లావుద్దీన్, రఫీ, రియాజుల్లా, షాబుద్దీన్, ఇందాదుల్లా, హారున్, అస్లామ్, మస్తాన్, అమీరుల్లా, ఇమాములు అబ్దుల్లా, తమీమ్, ముస్తఫా, నవాజ్, ఖాజీ నవాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మౌలాకా పహాడ్‌ను సందర్శించిన డీఎస్పీ



మౌలాకా పహాడ్‌కు సమీపంలోని దర్గాను పరిశీలిస్తున్న డీఎస్పీ, సీఐ, తహసీల్దార్‌లు

పెద్దమండ్యం : మండలంలోని ఎన్‌వోపల్లె పంచాయతీలోని మౌలాకాపహాడ్‌ను మదనపల్లె డీఎస్పీ కొండయ్యనాయుడు బుధవారం సందర్శించారు. పహాడ్‌కు సమీపంలోని దర్గా వద్ద ఓ వర్గం ఉరుసు ఉత్సవం కోసం అధికారులకు విన్నవించడంతో ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ ఉరుసు ఉత్సవం విషయమై ఓ వర్గం అభ్యంతరం చెప్పడంతో వివాదంగా మారినట్లు తెలిసింది. దీంతో మౌలాకా పహాడ్ కింది భాగంలో ఉన్న దర్గాను, రహదారిని డీఎస్పీ, సీఐ, తహసీల్దార్‌తో కలిసి పరిశీలించారు. ఉరుసు ఉత్సవం జరిగే ప్రాంతం ప్రైవేటు స్థలమా, ప్రభుత్వ స్థలమా అనే విషయమై రెవెన్యూ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఉరుసు విషయమై మదనపల్లె సబ్ కలెక్టర్ వారి ఆధ్వర్యంలో పీస్ కమిటీ నిర్వహించి నిర్ణయం తీసుకోంటామని డీఎస్పీ తెలిపారు. ఈ మేరకు ఇరు వర్గాల వారికి సమాచారం ఇవ్వాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ములకలచెరువు సీఐ లక్ష్మన్న, తహసీల్దార్ సయ్యద్ అహ్మద్, ఎస్‌ఐ పి విరమణ, సర్వేయర్‌లు, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

14న గ్రామోత్సవం

మదనపల్లె సిటీ : ఈ నెల 14వ తేదీన అయ్యప్ప స్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు అయ్యప్ప స్వామి ఆలయ ఉత్సవ కమిటీ సభ్యులు సుధాకర్‌నాయుడు, జర్మన్‌రాజు, సోమశేఖర్, మహేష్, భాస్కర్‌నాయుడు, శివమూర్తి, భగవాన్, ధంకనాచారి తెలిపారు. స్థానిక అయ్యప్పనగర్‌లో వెలసిన అయ్యప్పస్వామి ఆలయం నుంచి ప్రత్యేక రథంలో స్వామిని కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. అయ్యప్పనగర్ నుంచి సొసైటీకాలనీ, ఎన్టీఆర్ కాలనీ, బెంగళూరు బస్టాండు, టౌన్ బ్యాంకు సర్కిల్, సీటీఎం రోడ్డు, బర్మా రోడ్డు, సుభాష్ రోడ్డు, నిమ్మనపల్లె సర్కిల్, చిత్తూరు బస్టాండు, నెహ్రూబజార్, అప్పారావువీధుల మీదుగా గ్రామోత్సవం జరుగుతుందన్నారు.

వైభవంగా గీతాపారాయణం



గుర్రంకొండలోని శ్రీకృష్ణ మందిరంలో గీతాపారాయణం నిర్వహిస్తున్న భక్తులు

గుర్రంకొండ : మండల కేంద్రమైన గుర్రంకొండలో గీతా పారాయణ కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. బుధవారం గీతా జయంతిని పురస్కరించుకొని స్థానిక ఇందిరమ్మ కాలనీలోని శ్రీ కృష్ణమందిరంలో గీతా పారాయణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా భగవద్గీతలో మొత్తం 18 అధ్యాయాలను ఉదయం నుంచి సాయంకాలం వరకు గానం చేశారు. గీతాపారాయణం ముగిసిన అనంతరం ఆలయంలో భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి తరలివచ్చి స్వామివారికి పూజలు నిర్వహించారు.

ఘనంగా పాలేటి గంగమ్మ జాతర



ప్రత్యేక అలంకరణలో పాలేటి గంగమ్మ

మదనపల్లె సిటీ : మదనపల్లె పట్టణం వై.ఎస్.జగన్ కాలనీలో బుధవారం పాలేటి గంగమ్మ జాతర ఘనంగా జరిగింది. అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. మహిళలు బోనాలు సమర్పించారు. ఆలయం ఎదుట నిమ్మకాయలతో దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

పాడి పరిశ్రమ అభివృద్ధి చెందాలి



పాడి రైతులకు మందులు పంపిణీ చేస్తున్న వైద్యాధికారులు

ఓబులవారిపల్లె : పశుసంపద పెరిగి, పాడిపరిశ్రమ అభివృద్ధి చెందాలని డీఎల్ డీఏ వైద్యాధికారి శివరాంరెడ్డి పేర్కొన్నారు. బుధవారం బాలిరెడ్డిపల్లి గ్రామంలో రాష్ట్ర గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా శివరాంరెడ్డి మాట్లాడుతూ పాల దిగుబడి పెరిగే విధంగా పాడి రైతులు సూచనలు, సలహాలు పాటించాలన్నారు. ఏడాదికి ఒక దూడ ఎలా పొందాలి, పశువుల పెంపకం, పాల దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం పశువులకు గర్భకోశ వ్యాధులకు సంబంధించిన చికిత్స చేశారు. అనంతరం నట్టల నివారణ మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రైల్వే కోడూరు ఏడీ సురేష్ రాజు, వైద్యులు ప్రతాప్, దుర్గా నాగమ్మ, ఏహెచ్‌ఏ మణికంఠ, హరిత గోపాలమిత్ర సహదేవ, స్థానిక రైతులు బాబురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలపైనే అర్జీలు



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న అధికారులు

పెద్దతిప్పసముద్రం : రెవెన్యూ సదస్సుల్లో రైతుల నుంచి అధికంగా భూ సమస్యలపైనే అర్జీలు అందుతున్నాయి. బుధవారం మండలంలోని టి.సదుంలో జరిగిన రెవెన్యూ సదస్సులో మొత్తం 38 అర్జీలు రాగా అందులో 37 అర్జీలు భూములకు సంబంధించినవే ఉన్నాయి. సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతామని అధికారులు హామీ ఇచ్చారు. కమ్యూనిటి మొబలైజేషన్ అధికారి కరుణాకర్,డి ప్యూటీ తహసీల్దార్‌లు విద్యాసాగర్, ధనంజనేయులు, ఆర్‌ఐ బాలాజి, వీఆర్వో అమర తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులో 25 అర్జీలు

తంబళ్లపల్లె : మండలంలోని దిగువపాళెంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ప్రజల నుంచి వివిధ సమస్యలపై 25 అర్జీలు వచ్చినట్లు నోడల్ ఆఫీసర్, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూధన్, తహసీల్దార్ హరికుమార్ తెలిపారు. డీకేటీ పట్టాలు మంజూరు కోసం 10 అర్జీలు, పక్కా ఇళ్ల మంజూరుకు 4, సర్వే కోసం 2, అన్నగారిపల్లెకు శ్మశానవాటిక కేటాయించాలని 1, రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేయాలని 8 అర్జీలు వచ్చాయన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో నమోదుచేసి అర్జీదారులకు రసీదులు ఇచ్చామన్నారు. సమస్యలను పరిష్కరించేందుకు తగుచర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సబ్‌రిజిస్ట్రార్ ఉదయ్ కిరణ్‌రెడ్డి, ఎఫ్‌బీఓ రామరాజ్, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

రామనాయక్‌తండాలో రెవెన్యూ సదస్సు

పెద్దమండ్యం : మండలంలోని రామానాయక్‌తండాలో బుధవారం రెవెన్యూ సదస్సును నిర్వహించారు. ప్రాథమిక పాఠశాల వద్ద జరిగిన సదస్సులో భూ సమస్యలపై ప్రజల నుండి అందిన అర్జీలను తహసీల్దార్ సయ్యద్ అహ్మద్ పరిశీలించారు. ఆన్‌లైన్, మ్యుటేషన్, సర్వే కోసం పలువురు రైతులు వినతి చేశారు. సదస్సులో పింఛన్లు, ఇతర సమస్యలపై ప్రజల నుంచి వినతులు వచ్చాయి. రైతుల సమస్యలను పరిష్కరిస్తామని తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ రమేష్, వీఆర్‌వోలు, సర్వేయర్‌లు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు బాధ్యతతో పనిచేయాలి



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : ప్రజాసమస్యలపై రెవెన్యూ అధికారులు బాధ్యతతో వ్యవహరించి, సకాలంలో స్పందిస్తే సమస్యలు ఉండవని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. బుధవారం మండలంలోని తట్టివారిపల్లె సచివాలయం వద్ద సర్పంచ్ సిద్ధల దీపా అధ్యక్షతన..వెంకప్పకోట, పామయ్యగారిపల్లెకు సంబంధించి రెవెన్యూ సదస్సు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ముఖ్యఅతిథిగా హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. పరిష్కారానికి కృషిచేయాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రెవెన్యూ సదస్సులో ఇచ్చిన ప్రతి అర్జీకి రసీదు ఇవ్వడంతో పాటు ఆన్‌లైన్‌లో నమోదుచేస్తారని, అర్జీకి సంబంధించి అధికారులు తీసుకున్న చర్యల సమాచారం నేరుగా అర్జీదారుడి సెల్‌ఫోన్‌కు సమాచారం అందుతుందన్నారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌డీఓ అమరనాథరెడ్డి, తహసీల్దార్ ఖాజాబీ, ఎంపీడీఓ తాజ్‌మస్రూర్, ఎంఈఓ ప్రభాకరరెడ్డి, ఆర్‌ఐ శేషాద్రి, వీఆర్వో రెడ్డిప్రసాద్, సెక్రటరీ రవి, నాయకులు సిద్ధల వేమారెడ్డి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నికలు పక్కాగా నిర్వహించాలి



సాగునీటి సంఘాల ఎన్నికలపై అవగాహన కల్పిస్తున్న ఇరిగేషన్ డీఈఈ ప్రసాద్

నిమ్మనపల్లె : మండలంలో ఈనెల 14న జరగనున్న సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల ప్రత్యేక అధికారి ఇరిగేషన్ డీఈఈ ప్రసాద్ అన్నారు. బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో తహసీల్దార్ ధనుంజయులుతో కలసి ఎన్నికల విధులలో పాల్గొంటున్న సిబ్బందికి అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రక్రియను వివరించారు. ఎన్నికల విధుల్లో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మండలంలో బహుదా రిజర్వాయర్ ప్రాజెక్ట్, కుమార అహోబిలనాయుని చెరువు, కోమటివాని చెరువు, కొండవంక చెరువులకు సాగునీటి వినియోగదారుల సంఘం ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. ఈ నెల 14వ తేదీన నిమ్మనపల్లి జడ్పీ హైస్కూల్ లో ఉదయం ఎనిమిది గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికల ప్రక్రియ జరుగుతుందన్నారు. ఎన్నికలలో ఆయకట్టు రైతులు ఓటర్లుగా ఉంటారన్నారు. ఓటు హక్కు వినియోగించుకునే రైతులు ముందుగా నీటి తీరువా చెల్లించి ఉండాలన్నారు. సాయంత్రం మూడు గంటల నుంచి 5 గంటల మధ్య అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. గతంలో సాగునీటి సంఘాల కాల పరిమితి రెండు సంవత్సరాలు మాత్రమే ఉండేదని, ప్రస్తుతం ప్రభుత్వం దానిని ఐదు సంవత్సరాల వరకు పొడిగించిందన్నారు. ఎన్నికలు ఏకగ్రీవమైతే వారికి ప్రభుత్వం తగిన పారితోషకం అందజేస్తుందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు సజావుగా జరిగేలా పోలీసు సిబ్బందితో బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో పరమేశ్వర్ రెడ్డి, ఏఈలు శ్రీధర్ రెడ్డి, మిథున్ చక్రవర్తి, అమర్నాథ్, డిటి బాబ్జి, మండల వ్యవసాయ అధికారి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రవహించిన సప్లై చానల్ నీరు



రోడ్డుపై ప్రవహిస్తున్న అయ్యపునాయుని చెరువు సప్లై చానల్ నీరు

పీలేరు రూరల్ : స్థానిక ఎల్‌బీఎస్ రోడ్డు కట్టుకాలువ వద్ద అయ్యపునాయుని చెరువు సప్లై చానల్ నీరు రోడ్డుపై ప్రవహించడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఇటీవల కురిసిన వర్షాలతో పింఛానది ప్రవహిస్తోంది. పింఛా నది నుంచి సప్లై చానల్ ద్వారా నీటిని అయ్యపునాయుని చెరువుకు మళ్లించారు. అయితే పట్టణంలో ఆర్‌ఓబీ నిర్మాణ పనులతో సప్లై చానల్ కల్వర్టు పూడిపోయింది. దీంతో నీరు మొత్తం రోడ్డుపై ప్రవహించడంతో వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

విశ్రాంత వీడీఓ మృతికి మాజీ ఎమ్మెల్యే సంతాపం



విశ్రాంత వీడీఓ భౌతికకాయానికి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి(వాల్మీకిపురం) : వాల్మీకిపురం పట్టణ పరిధిలోని తోటవీధికి చెందిన విశ్రాంత వీడీఓ పీవీ క్రిష్ణారెడ్డి(82) మృతిపట్ల పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి సంతాపం ప్రకటించారు. ఆయన మరణించిన సమాచారం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే బుధవారం ఉదయం వారి స్వగృహానికి చేరుకుని భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఓబులంపల్లికి చెందిన చింతల దిలీప్ కుమార్‌రెడ్డి ఉత్తర క్రియలకు హాజరై కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆనందరెడ్డి, నీళ్ల భాస్కర్, బిడ్డల కేశవరెడ్డి తదితరులు మాజీ ఎమ్మెల్యే వెంట ఉన్నారు.

క్రీడల్లో గెలుపు, ఓటములు సహజం



బహుమతులు అందుకుంటున్న విజేతలు

సిద్దవటం : క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని ఇన్‌చార్జి కమాండెంట్ డి నాగేశ్వరప్ప తెలిపారు. మండలంలోని 11వ ఏపీఎస్పీ బెటాలియన్‌లో రెండు రోజులపాటు జరిగిన 17వ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ బుధవారం ముగింపు వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఇన్‌చార్జి కమాండెంట్ మాట్లాడుతూ రెండురోజులుగా వార్షిక క్రీడా పోటీలు నిర్వహించడం జరిగిందన్నారు. రెండవరోజు పరుగు పందెం పోటీలు, టగ్ ఆఫ్ వార్ పోటీలు డీ ఈ కంపెనీల మధ్య రసవత్తరంగా జరుగగా.. డీ కంపెనీ విజేతగా నిలిచిందన్నారు. అనంతరం గెలుపొందిన విజేతలకు ఇన్‌చార్జి కమాండెంట్ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్లు కె వెంకటరెడ్డి, ప్రసాద్, ఆర్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.